క్లుప్తంగా

గడువులోగా ఈ కేవైసీ చేయించుకోవాలి

దేవరకొండ : రేషన్‌కార్డు దారులు గడువులోగా ఈ కేవైసీ చేయించుకోవాలని దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ అన్నారు.మంగళవారం దేవరకొండ మార్కెట్ యార్డు సివిల్ సప్లయ్ గోదాం వద్ద ఈ కేవైసీ ప్రచార వాహనాలను సివిల్ సప్లయ్ డిటీ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు అందరూ ఆయా రేషన్ దుకాణాల వద్ద వేలి ముద్రలు వేసి ఈ కేవైసీని నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 29లోగా కార్డులోని సభ్యులు విధిగా తమ వేలి ముద్రలు వేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ కేవైసీ ఆవశ్యకతను వివరించేందుకు గాను వాహనాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వారి వెంట డీలర్లు కొర్ర శంకర్, చిలువేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన నవ్య, పవన్‌కుమార్

మిర్యాలగూడ : వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోట నవ్య 93.2, చెన్నా పవన్‌కుమార్ 92.3 పర్సంటైల్ సాధించగా మరో పదిమంది విద్యార్థులు 90కు పైగా పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, పీఎల్ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

మిర్యాలగూడ అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరుగురిని కోర్టులో హాజరుపర్చగా వారికి జడ్జి వారికి రూ.9,700 లను జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాడపల్లి ఎస్ఐకి సన్మానం

మిర్యాలగూడ : నూతనంగా బాధ్యతలు చేపట్టిన వాడపల్లి ఎస్ఐ ఇరుగు రవికుమార్‌ను యువజన కాంగ్రెస్ మంగళవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పరంగి సురేష్, షేక్ మజ్జుభాయ్, పరంగి రమేష్, కొడాలి ప్రశాంత్, పరంగి అంబేద్కర్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

దేవరకొండ : ఏఐవైఎఫ్ జిల్లా సమితి సమావేశంలో దేవరకొండ నియోజకవర్గానికి చెందిన ఎనిమల్ల నవీన్‌ను ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోగా ఏషమోని మల్లేష్‌ను ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఏఐవైఎఫ్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.తమ ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్ష,కార్యదర్శులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మేడారం జాతరకు డిపో నుంచి 150 మంది సిబ్బంది

మిర్యాలగూడ టౌన్: మేడారం జాతరకు మిర్యాలగూడ డిపో నుంచి 150 మంది ఆర్టీసీ సిబ్బందిని పంపిస్తున్నట్లు మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. మంగళవారం స్థానిక డీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం భద్రాద్రి ఆర్టీసీ డిపోకు 20 ఆర్టీసీ బస్సులను పంపించి అక్కడి నుంచి ఆపరేటింగ్ చేయనున్నట్లు చెప్పారు. 20 ఆర్టీసీ బస్సులకు 40 మంది డ్రైవర్లు, 20 మంది కండక్టర్లు, 8 మంది మెకానిక్‌లు ఈనెల 16వ తేదీన కొత్తగూడెం డిపోలో రిపోర్ట్ చేస్తారని పేర్కొన్నారు. వరంగల్ ఆర్టీసీ డిపోకు ఈ డిపో నుంచి మరో 40 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు వలంటీర్లుగా వెళ్లి ఆ డిపోలో రిపోర్ట్ చేస్తారన్నారు. జాతరకు ఆర్టీసీ బస్సులు పంపిస్తున్నందున కేశవపురం, తడకమళ్ల, ఇర్కిగూడెం, వీర్లపాలెం, అడవిదేవులపల్లి తదితర ప్రాంతాలకు బస్సులు అందుబాటులో ఉండవని చెప్పారు. సమావేశంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రామినేని సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

డిండి : సూర్యాపేట మండలం ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో చదువుతున్న వైష్ణవి మృతిపై విచారణ జరిపించాలని బీఎస్పీ మండలాధ్యక్షుడు ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

ముమ్మరంగా మిరప కోతలు



పెద్దవూర : బట్టుగూడెంలో మిరప కాయలను తెంపుతున్న కూలీలు



తాలు కాయలను ఏరుతున్న కూలీలు

- పెద్దవూర మండలంలో వేయి ఎకరాల్లో సాగు
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఇతర మండలాల నుంచి రాక

పెద్దవూర : నాన్ ఆయకట్టు ప్రాంతమైన పెద్దవూర మండలంలో మిరప కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతేడాది పత్తి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడం, మిరపకు అధిక ధర రావడంతో వానాకాలం సీజన్‌లో మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా మిరప పంటను సాగు చేశారు. మండలంలోని గర్నెకుంట, బట్టుగూడెం, వెల్మగూడెం, బసిరెడ్డిపల్లి, పెద్దగూడెం, తుంగతుర్తి, నాయినవానికుంటతండా, పెద్దవూర, కేకేతండా, పొట్టివానితండా, చలకుర్తి, బోనూతల తదితర గ్రామాలలో మిరప పంటను విరివిగా సాగు చేశారు. మండల వ్యాప్తంగా మిరప కాయలు ఒకేసారి కోతకు రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. వాతావరణంలో మార్పులకు ఈ యేడాది మిరప పంటను తెగుళ్లు, పురుగుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో మిరపలో తాలు శాతం పెరిగింది. ఏరిన మిరప కాయలను ఎండబెట్టిన తర్వాత తాలు కాయలు ఏరటానికి సైతం కూలీల అవసరం ఉంది. దీంతో చేలల్లో మిరపకాయలు ఏరడంతో పాటు తాలు ఏరడానికి కూడా కూలీలు వస్తున్నారు. గ్రామాల్లో కూలీలు దొరకకపోవడంతో అనుముల, తిరుమలగిరి, పెదఅడిశర్లపల్లి, గుర్రంపోడ్, నిడమనూరు, త్రిపురారం మండలాల నుంచి ఆటోలు, ట్రాక్టర్‌లలో కూలీలను తీసుకువస్తున్నారు. ఒకరోజు కూలీ రూ.300లతో పాటు ఆటో కిరాయి, మేస్త్రీ మామూలు కలుపుకుని దూరాన్ని బట్టి రూ.350 నుంచి 400 వరకు చెల్లిస్తున్నారు. ఒక క్వింటా ఎండు మిర్చి ఏరడానికి పది మందికి పైగా కూలీలు అవసరం అవుతున్నారు. ఏడెనిమిది నెలలుగా వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీనికితోడు నాగార్జునసాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో కాలువకు నీటిని విడుదల చేయలేదు. దీంతో ప్రస్తుతం ఆయా మండలాలలో పనులు లేకపోవడంతో కూలీలు వందలాదిగా తరలివస్తున్నారు. మిరప కోతలకు వెళ్లే కూలీలకు కూలీ డబ్బులతో పాటు, రైతులు మిరప కాయలు కూడా ఇస్తుండటంతో మిరప కోతలవైపు కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ఏ చేలో చూసినా కూలీలే ఉంటున్నారు.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి



వరిచేను పరిశీలిస్తున్న ఏఓ మాధవరెడ్డి

గుర్రంపోడు : మండలంలో వరి పంట ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల అగ్గితెగులు, జింక్ లోపం, కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో రైతులు, విస్తరణాధికారులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గితెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటిని 0.6 గ్రాములు ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మిల్లీలీటరు ఐసోప్రోనిధియోలిన్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు పిలకలు లేదా దుబ్బు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేయాలని అన్నారు. పొట్టదశలో ఉన్నప్పుడు 0.3ఎంఎల్ క్లోరాంట్రనిలిప్రోల్ లేదా 05ఎంఎల్ టెట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. ప్రస్తుతం వరిలో ప్రధానంగా కనిపించే జింక్ లోపం నివారణకు 2 గ్రాములు జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. ఏఈఓ జితేందర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక



కండువాలు కప్పి సీఐటీయూలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఫార్మాసూటికల్ పెద్దదేవులపల్లి కంపెనీలో టీఆర్ఎస్‌కేవీకి చెందిన కార్మికులు రాజీనామా చేసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా కార్మికులందరూ ఐక్యంగా ఉండిమస్యలపై రాజీ లేని పోరాటాలకు సిద్ధంకావాలని సూచించారు. సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డబ్బికార్ మల్లేష్, ఆవేతా సైదులు, సుధాకర్, వెంకటేశ్వర్లు, లింగయ్య, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అప్రజాస్వామికం



హాలియా : ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

హాలియా : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బలుస అరుణపై దాడి అప్రజాస్వామ్యికమని అనుముల మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడికి నిరసనగా మంగళవారం హాలియాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. బాధ్యులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సతీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టపల్లి వాసులు, చీదళ్ల లింగయ్య, కొత్తమాసు శ్రీనివాస్, చిట్టిప్రోలు శ్రీనివాస్, తేలప్రోలు శేఖర్, కొండూరు గణేష్, ఊర వేణు, కొండూరు వెంకటేశ్వర్లు, బచ్చు వెంకన్న, సతీష్, శోభన్‌బాబు, మహేష్, ధనలక్ష్మి, ఝాన్సీ, కళావతి ఉన్నారు.

కొండమల్లేపల్లి : అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రాజకీయ ప్రత్యర్థులు దాడి చేయడం సరికాదని కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె జనార్దన్, ప్రధాన కార్యదర్శి గౌరు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో చందా ధనుంజయ్య, సముద్రాల కిరణ్, విజయ్, మిర్యాల శ్రీనివాస్, పంపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



హాలియా : విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేస్తున్న సీడీపీఓ గంధం పద్మావతి

హాలియా : ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అనుముల సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల్లో నిర్వహించిన బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలను పుట్టనిద్దాం.. ఎదగనిద్దాం.. చదవనివ్వాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదని, శిశు విక్రయాలు, భ్రూణహత్యలు చేపట్టవద్దన్నారు. ఆడ పిల్లలను తల్లిదండ్రులు భారంగా చూడొద్దని ఆడ పిల్లల ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తుందన్నారు. అనంతరం 100,181,1098 హెల్ప్ లైన్ నంబర్ల గురించి పోక్సో చట్టంపై బాలికలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలకు వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, హాలియా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, పీటీ వెంకట్రాంరెడ్డి, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ హైమావతి, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పెద్దవూర : చలకుర్తిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ గౌసియాబేగం

పెద్దవూర : శిశు విక్రయాలు, బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, ఆడపిల్లల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ చలకుర్తి సెక్టార్ సూపర్‌వైజర్ గౌసియాబేగం అన్నారు సోమవారం మండలంలోని చలకుర్తి-2 అంగన్‌వాడీ కేంద్రంలో బేటి బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే 1098, మహిళలపై గృహ హింస, బలాత్కారం జరిగితే 181, ఏదైనా ప్రమాదంలో ఉంటే 100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. పిల్లలను సాకలేమని చెబితే శిశుగృహకు అప్పగిస్తామని పేర్కొన్నారు. చట్టపరంగా దత్తత ఇవ్వాలి తప్ప తల్లిదండ్రులు ఇవ్వడాన్ని చట్టం ఒప్పుకోదని అన్నారు. ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండితేనే వివాహాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.లక్ష్మీప్రభ, అంగన్‌వాడీ టీచర్లు శాంత, హెల్త్‌సూపర్‌వైజర్ రేణుక, ఏఎన్ఎం చంద్రకళ, ఆశాలు మంగమ్మ, కళమ్మ, పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియపై విచారణ చేపట్టాలి

మిర్యాలగూడ : సివిల్ సప్లయ్ స్టేజ్-2 కాంట్రాక్టర్ల టెండర్ల ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని కూరెళ్ల శివ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-25 సంవత్సరానికి గాను సంబంధించిన సివిల్ సప్లయ్ స్టేజ్-2 కాంట్రాక్ట్ కోసం ఈనెల 1న పేపర్ ప్రకటన ఇచ్చి ఈనెల 9న ఆన్‌లైన్ టెండర్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. ఒక్కో మండలానికి ఎంఎల్ఎస్ పాయింట్-2కు ఎంతమందైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో 8 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉండగా పాత కాంట్రాక్టర్ సంబంధిత శాఖ అధికారులతో కుమ్మక్కై తనకే దక్కే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ తేదీల ప్రకారం చేయకుండా పాత కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో జిల్లాలో 8 ఎంఎల్ఎస్ పాయింట్లకు 10 నుంచి 20 టెండర్లు వేయగా 2023-25 సంవత్సరానికి గాను 8పాయింట్లకు 20 టెండర్లు మాత్రమే రావడం జరిగిందన్నారు. కొన్ని పాయింట్లలో రెండేసి చొప్పున మాత్రమే వచ్చాయని, వీటిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లయ్ డీఎం, డీఎస్ఓలు విచారించి న్యాయం చేయాలని వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. ఆయన వెంట కూరెళ్ల వెంకటాచారి, సందీప్‌లు ఉన్నారు.

టెండర్‌లో పాల్గొనకుండా వివక్ష చూపారు

పట్టణంలోని 29వ వార్డు రేషన్ డీలర్ అంటూ తనను సివిల్ సప్లయ్‌కు సంబంధించిన టెండర్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నారని గజ్జి అమృతవల్లి మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ టెండర్‌లో పాల్గొనకుండా అధికారులు, రాజకీయ నాయకులు కుట్ర పన్నారని, దీంతో కోర్టుకు వెళ్లడం జరిగిందని, కోర్టు సైతం టెండర్‌లో పాల్గొనవచ్చని ఈనెల 7న హైకోర్టు తీర్పు కూడా వెల్లడించిందని, ఆ కాపీలను అందజేయగా ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేసి చివరి నిమిషంలో టెండర్ వేసుకోమని చెప్పినట్లు తెలిపారు. సమయం లేక దరఖాస్తు చేసుకోలేకపోయానన్నారు. ఈ విషయంపై టెండర్ రీకాల్ చేసి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

రాష్ట్ర స్థాయి స్పెల్ విజార్డ్ పోటీలకు ఎంపిక



బహుమతిని అందుకుంటున్న శ్రావణ్‌కుమార్‌రావు

డిండి : జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజీలో (ఈఎల్‌టీఏ) ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోషియేషన్ వారి . ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పెల్ విజర్డ్ పోటీల్లో పాల్గొన్న మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి జే.శ్రావణ్‌కుమార్‌రావు తన ప్రతిభను కనపరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.కర్ణాకర్ తెలిపారు. స్పెల్ విజర్డ్ పోటీల నిర్వాహకులు శ్రావణ్‌కుమార్‌కు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈనెల 26న నిర్వహించే రాష్ట్ర స్థాయి స్పెల్ విజర్డ్ పోటీల్లో శ్రావణ్‌కుమార్ పాల్గొంటాడని పేర్కొన్నారు. సందర్భంగా శ్రావణ్‌కుమార్‌తో పాటు గైడ్‌గా ఉన్న ఇంగ్లీష్ టీచర్ సయ్యద్ జిలానీని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మనస్సులు కలిసిన వేళ



పురుషోత్తం యాదవ్, సుమతి దంపతులు, కుమారులు

హాలియా : అనుముల మండలం మధారిగూడెం గ్రామానికి చెందిన ఆవుల పురుషోత్తం, ప్రస్తుత అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతిలది సామాజిక వర్గాలు వేరైన వారి మనస్సులు కలిశాయి. వారి ఇళ్లలో ఒప్పుకోలేదు. అయిన వారు వివాహం చేసుకుని ఒకరినొకరు అర్థం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. వాళ్ల ప్రేమ వివరాలు పురుషోత్తం మాటల్లో.. నేను మాధారిగూడెం గ్రామ సాక్షరభారత్ కోఆర్డినేటర్ పనిచేస్తున్న సమయంలో సుమతి కూడా హాలియా గ్రామ సాక్షర భారత్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తుంది. ఆ సమయంలో సుమతితో నాకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. పేర్ల సుమతిది మాది వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో మొదట మా ఇద్దరి ఇళ్లలో ఎవరూ ఒప్పుకోలేదు. దీంతో నేను సుమతి 2014 మే 3న యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో వివాహం చేసుకున్నాను. కుటుంబ పోషణ కోసం నేను హైదరాబాద్‌లోని ఓ (మార్గదర్శి) చిట్‌ఫండ్‌లో కొంతకాలం పనిచేశాను. ఆ తరువాత మేము రెండు కుటుంబాలను ఒప్పించాం. ప్రస్తుతం తాము హాలియాలో నివాసం ఉంటున్నాం. నేను బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడిగా కొనసాగుతుండగా నా భార్య పేర్ల సుమతి ప్రస్తుతం అనుముల మండల ఎంపీపీగా కొనసాగుతోంది. మేము వివాహం చేసుకొని 10 ఏళ్లవుతున్నా మా జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఒకరి బాధలు మరొకరం అర్థం చేసుకుంటాం. మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఆవుల అభిరాం మూడో తరగతి, రెండో కుమారుడు భార్గవ్‌రాం రెండో తరగతి చదువుతున్నాడు. ఏపని చేయాలనుకున్నా ఇద్దరం మాట్లాడుకున్న తర్వాతనే ప్రారంభిస్తాం. ఇప్పటికీ కూడా ఇద్దరిది ఒకటే మాట. ప్రేమ వివాహం జీవితం ఎంతో తృప్తినిస్తుంది.


టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం



టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఎస్ఎఫ్ఐ ఉద్యమాలే కాకుండా విద్యార్థుల కోసం టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులు రూ.30 ఫీజు చెల్లించి హాల్ టికెట్ పొందాలని పూర్తి వివరాలకు 7730005726, 9182865288 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ప్రభుత్వ పాఠశాల ప్రదానోపాధ్యాయులు ధర్మానాయక్, పరశురాం, నాయకులు కుర్ర సైదానాయక్, వీరన్న, కోటేష్, శివ, కళ్యాణ్, తరుణ్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో రాజకీయ పార్టీల కార్మిక, రైతు సంఘాలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరెపల్లి వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల నేతలు బంటు వెంకటేశ్వర్లు, వస్కుల మట్టయ్య, రవినాయక్, రామ్మూర్తి, మంగారెడ్డి, సైదులు, వినోద్‌నాయక్, పాపానాయక్, వరలక్ష్మి, గోవర్ధన్ ఉన్నారు.

చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం సమ్మె నోటీసును ఎంపీడీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లోజు శేఖరాచారి, శంషొద్దీన్, శ్రీకాంత్, నర్సింహ, శంకర్, పాల్గొన్నారు.

మిర్యాలగూడ : ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు నాగయ్య, వెంకటేశ్వర్లు, ఎస్‌కె.చాంద్‌పాషా పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాన్ని నిరసిస్తూ ఈనెల16న తలపెట్టిన గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం గ్రామపంచాయతీ ఈఓ వీరబాబుకు సమ్మె నోటీసు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



రోడ్డు పక్క కాలువలోకి దూసుకెళ్లిన కారు

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన మంగళవారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం వద్ద చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ సతీష్‌వర్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన మహేందర్‌రెడ్డి తన భార్య భవ్య, ఇద్దరు పిల్లలు శ్రీనిశ్‌రెడ్డి, రేవాన్‌రెడ్డి, తన బంధువు ఎన్ మల్లారెడ్డిలతో కలిసి చైన్నైలో తన బంధువుల వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారి మండలంలోని కిష్టాపురం వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లి అక్కడ ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. కొమిరెల్లి మహేందర్‌రెడ్డి సొంతూరు యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా ఈరోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలలైన వారిని 108 సహకారంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ వర్మ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆర్ నవ్య

కొండమల్లేపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఆర్.నవ్య ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం చెరుపల్లి శ్రీనివాస్ తెలిపారు. అలాగే వక్తృత్వ పోటీల్లో బి.స్పందన జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థినులను అభినందించిన వారిలో ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయక్, జగదీశ్వర్, నల్ల నరసింహ, సముద్రాల శ్రీనివాస్, ఉమా మహేశ్వరి, జనార్దన్‌రెడ్డి, దేవకుమార్, సైదానాయక్, చంద్రయ్య పాల్గొన్నారు.

కవిత విభాగంలో..

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.నాగశివ మంగళవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కవిత విభాగంలో రెండో స్థానం పొందినట్లు మండల నోడల్ అధికారి, హెచ్ఎం నోముల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నాగశివను అభినందించారు. నాగశివ జిల్లాస్థాయిలో ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర గీతాన్ని ఏర్పాటు చేయాలి

హాలియా : రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ప్రకటించిన రాష్ట్ర గీతంపై పునరాలోచన చేసి ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర గీతాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణానికి చెందిన రాష్ట్ర గీత రచయిత శ్రీకళారామమూర్తి మంగళవారం హాలియాలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ప్రకటించిన రాష్ట్ర గీతంపై పునరాలోచన చేసి రాష్ట్ర గీతాన్ని 2014 జూన్‌కు ముందు ఉన్న గీతాల్లో అర్హత ఉన్న గీతాలనన్నింటిని పరిగణలోకి తీసుకొని రాష్ట్ర గీతాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

హాలియా : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వి మాధవి అన్నారు. మంగళవారం హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం చదువుకున్నట్లేనని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారని, చాలా సందర్భాల్లో పురుషుల కంటే ముందు వరుసలో ఉంటున్నారని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ యాదయ్య, అధ్యాపక, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.